సకాలంలో వరి నాట్లు పూర్తిచేయండి

- ఆలస్యమైతే వెదజల్లే పద్ధతే మేలు
- మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్

భీమవరం అర్బన్: దాళ్వా సాగులో వరినాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలం తాడేరు గ్రామంలో దాళ్వాలో ముందస్తు నాట్లపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 10,600 ఎకరాలలో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టగా, ఇప్పటివరకు దిరుసుమర్రు, యనమదుర్రు, నరసింహపురం, రాయలం, కొవ్వాడ అన్నవరం, గొల్లవానితిప్ప తదితర గ్రామాల్లో ఆరు వేల ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని తెలిపారు. తుందుర్రు, బేతపూడి, పెదగరువు, తాడేరు, అనాకోడేరు, కొమరాడ గ్రామాల్లో వరి నాట్లు నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. నాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లేకుంటే మార్చి నెలాఖరున, ఏప్రియల్ మొదటి వారంలో వచ్చే సీటి ఎద్దటికి పంట దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. వరినాట్లు ఆలస్యమయ్యే రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలని సూచించారు. ఈ విధానం వల్ల రెండు వారాలు సమయం ముందుగా పంట కోతకువస్తుందని, ఎకరానికి రూ.3 వేలు ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు. వరినాట్లు వేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 5,600 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వ నుంచి పథకాలు లబ్ధి పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


తాడేరు గ్రామంలో వరినాట్లను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

క్లుప్తంగా

ముగిసిన పైళ్లమ్మ జాతర


పైళ్లమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ చైర్మన్ వెంకటసోమరాజు

ఉండి: మండలంలోని చిలుకూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పైళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ముగ్గురి అరెస్ట్ : రూ.42 వేలు స్వాధీనం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రామాయణపురం గ్రామంలో కోడి పందేలపై ఎస్సై వి.అప్పలరాజు తన సిబ్బందితో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,090, కోడి పుంజు, కోడి కత్తిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీఎస్ఎం గరల్స్ హైస్కూల్ హెచ్ఎంగా సుధారాణి


హెచ్ఎం సుధారాణిని అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక పొట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినిగా జె.సుధారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ హెచ్ఎంగా పనిచేసిన కేవీవీ భోగేశ్వరరావు డిసెంబర్‌లో చనిపోవడంతో సుధారాణిని నియమించారు. స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ వీఎం రాధాకృష్ణ తదితరులు సుధారాణికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

నేడు మోటారు సైకిళ్ల వేలం

నరసాపురం: వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు మోటారు సైకిళ్లను శనివారం ఉదయం 10 గంటలకు నరసాపురం ఎస్ఈబీ స్టేషన్‌లో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఎస్ఈబీ సీఐ డి.సురేఖ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనాలి అని అనుకునే వారు ముందుగా ఎస్ఈబీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. డిపాజిట్ రూ.2 వేలు చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

విద్య నైపుణ్యాలపై సోషల్ ఆడిట్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్య నైపుణ్యాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారిణి వాసవి ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థుల విద్యాప్రమాణాలు, నైపుణ్యాలు, ఇతరత్ర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సమాధానాపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఏ-1 పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. ఆమె వెంట ప్రిన్సిపల్ బి.రాజారావు ఉన్నారు.

శాశ్వత భూహక్కు రైతులకు ఎంతో ఉపయోగం

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం రైతులుకు ఎంతో ఉపయోగమని తహసీల్దార జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. జగనన్నభూహక్కులో భాగంగా వల్లూరుపల్లి నుంచి బోడపాడు, చింతపల్లి గ్రామాల్లో సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని శుక్రవారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 932 ఎకరాలకు గానూ 282 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ఈ పథకం కమతాలను నమోదు చేసేందుకు ఎంతో ఉపయోగమన్నారు. భూహక్కు పత్రాలకు ఇచ్చేందుకు, రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా ఉండేందుకు గాను ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ఈ సమస్యవల్ల రైతులు ఇప్పటివరకు ఎంతో ఇబ్బందులు పడుతుండేవారన్నారు. ఆ ఇబ్బందులు నేటితో వైలదొలగుతాయన్నారు. చైను, టేబుల్‌తో భూమిని కొలిచే స్థాయి నుంచి ఈటీఎస్ పరికరం ద్వారా రిసర్వే చేసే టెక్నాలజీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సరిహద్దు, పొలంగట్లు తదితర తగాదాలు ఇక ఉండబోవన్నారు. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విధానం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరుపల్లి, బోడపాడు గ్రామాల సర్పంచ్‌లు దంగేటి రామస్వామి, గేదల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి జనార్ధన స్వామి కల్యాణోత్సవాలు

పెంటపాడు: ఈనెల 30 నుంచి పడమరవిప్పర్రు భూనీలా సమేత జనార్ధన స్వామి వార్షిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న అంకురార్పణ, ధ్వజారోహణం, 31న రాత్రి కల్యాణోత్సవం, ఫిబ్రవరి 1న మధ్యాహ్నం అఖండ అన్నసమారాధన, రాత్రి గరుడవాహనసేవ, 2న పంచామృత అభిషేకం, విశేష ఆరాధన, 3న చక్రస్నానం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారికి దర్శించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

కాళ్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకిల్లు దగ్ధమైన ఘటన గురువారం అర్ధరాత్రి దొడ్డనపూడిలో చోటుచేసుకుంది. వీఆర్వో ఏడుకొండలు తెలిపిన వివరాలు ప్రకారం దొడ్డనపూడిలోని కచ్చాగరువు ప్రాంతంలో జడ్డు గోపాలకృష్ణ కి చెందిన తాటాకింట్లో అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమై గృహోపకరణాలు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఆకివీడు నుంచి ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపు చేశాయన్నారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

అగ్ని బాధిత కుటుంబాలకు బాస్విని చారిటబుల్ ట్రస్ట్ తరఫున శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. దొడ్డనపూడి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న సర్పంచ్ కొల్లి సుబ్బారావు తన భాస్విని చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులను పంపి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనవంతు సహాయంగా ట్రస్ట్ తరఫున రూ.5000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి నరసింహమూర్తి పాల్గొన్నారు.


దొడ్డనపూడిలో అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన తాటాకిల్లు

క్రీడలపై ఆసక్తి అవసరం


జిన్నూరులో పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోడూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని 'మనకోసం మనం' స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు పడాల పెద్దిరాజు పిలుపునిచ్చారు. మనకోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిన్నూరు గ్రామంలో ఇటీవల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఆటలపోటీలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గలవిల సత్యనారాయణమూర్తి, కలిశెట్టి కనకారావు, డాక్టర్ వీరాచార్యులు, పడాల కృష్ణవేణి, చెల్లెం ఏసురత్నం, దాసరి సత్యనారాయణ, దాసరి సూర్యనారాయణ, నున్నగొప్పుల పెద్దిరాజు, కలిశెట్టి లక్ష్మీ, పడాల రాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో యాళ్లవానిగరువు, దొండపేట, ముచ్చర్లవారిపుంత ప్రాంతాల్లో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు గురువారం శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో తక్షణం చేపట్టాల్సిన పనులు ఏమైనా ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డ్వాక్రా భవనం, అంగన్‌వాడీ భవనాల పనులు తక్షణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని పలువురు శ్రీనివాస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్న), వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా ఇర్మియారాజు, నల్లి నాగరాజు, పంచాయతీ సిబ్బంది బండారు శివరామకృష్ణ, జక్కంపూడి రాంబాబు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, బండి రమేష్, సబ్బే శ్రీను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లు బాధ్యతగా పనిచేయాలి

ఆశ వర్కర్‌గా నియమితులైన వారు బాధ్యతగా పనిచేసి అధికారుల మన్ననలు పొందాలని జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని బంగారువారి చెరువుగట్టు, వీవర్స్ కాలనీ ప్రాంతాల్లో పనిచేయడానికి నియమితులైన 9 మంది ఆశా వర్కర్లు గురువారం జెడ్పీచైర్మన్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ వైద్య విధానంలో భాగంగా ప్రతీ 1000 మంది జనాభాకు ఒక ఆశ కార్యకర్తను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. వారికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసి ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.


యాళ్లవానిగరువులో డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పాలకొల్లు సెంట్రల్: పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేలా శానిటరీ అధికారులు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మునిసిపల్ కమిషనర్ నెల్లుట్ల ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో సీడీఎంఏతో వీడియో కాన్ఫరెన్స్ పూర్తయిన తరువాత మునిసిపల్ అధికారులు, సచివాలయ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ఎవరైనా ప్లాస్టిక్‌ను వాడితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులకు అవగాహనా సదస్సులు ఏర్పాటుచేయాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పట్టణంలో డ్రోన్ సర్వే ద్వారా పారదర్శకంగా భూ సర్వే చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈ సాంబశివుడు, టీపీఓ వీరబ్రహ్మం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఏఈ సతీష్, టీపీఎస్ త్రినాథ్, జె1 సతీష్, జె2 చందు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది

మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి

నరసాపురం: విద్యార్థులు మానసిక వత్తిడి తగ్గించుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్, హిప్నో థెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకరన్ సూచించారు. శుక్రవారం వైఎన్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ, స్టేజ్ హిప్నోటిజం అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మా కమలాకరన్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవుతుంటారని చెప్పారు. అయితే బిగినింగ్, మిడిల్, ఎండింగ్ అనే సూత్రం పాటించడం ద్వారా వత్తిడి జయించవచ్చని సూచించారు. ఏకాగ్రతను, మేథా సంపత్తిని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ హిప్నో పద్మా కమలాకరన్ తొలి మహిళా హిప్నాటిస్ట్‌గా రాష్ట్రపతి నుంచి అవార్డు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కనకారావు, పీజీ కోర్సుల డైరెక్టర్ నిమ్మల చింతారావు, డీన్ గంధం రామకృష్ణ, హెచ్ఆర్డీ సెంటర్ కన్వీనర్ సీమెచ్ కనకారావు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న హిప్నో థెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకరన్

మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలి

మొగల్తూరు: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ సిద్ధాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్, వేల్ఫేర్ అసిస్టెంట్‌లు వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళీపట్నం తూర్పు, మోడి, జగన్నాథపురం, కొత్తోట గ్రామాల్లోని లేఅవుట్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఆయా గ్రామాల్లో పనులు వేగవంతం చేసేలా ప్రతీ రోజు పర్యవేక్షించాలన్నారు. జగనన్న లేఅవుట్‌లలో పట్టాలిచ్చిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను కూడా వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద కుమార్, హౌసింగ్ ఏఈ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ సిద్ధాంతి

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్‌ను నియమించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పల్లెలు, పట్టణాల్లో ఆహార పదార్ధాల్లో రక రకాల కల్తీలు జరుగుతున్నందున ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే నిమిత్తం వెంటనే జిల్లాకు ముగ్గురు చొప్పున ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించాలని ఏపీ స్టేట్ కన్స్యూమర్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హనుమంతరావుచే ఏపీ చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టేట్ ఫుడ్ కమిషనర్‌లకు శుక్రవారం లేఖలు రాశారు. కల్తీ పాలు, కల్తీ నెయ్యి, కర్రి పాయింట్లు, స్వీట్ దుకాణాలు, మాంసం దుకాణాలు, ఇతర ఆహార పదార్ధాలు కల్తీలు మార్కెట్‌లో తాండవిస్తున్నాయని వాపోయారు. కొందరు వ్యాపారస్తులు స్వలాభం కోసం కల్తీలకు పాల్పడతున్నారని, అంతేగాక పలు ప్రాంతాలలో నిల్వ పదార్థాలు అమ్ముతున్నారని వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు, మొబైల్ వాహనం ఏర్పాటు, అధికారులచే విస్తృత తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

పందులను జనావాసాలకు దూరంగా ఉంచాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జనావాసాలకు దూరంగా పందులను ఉంచే విధంగా పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది చూడాలని యాగర్లపల్లి 24వ వార్డు కాలనీ వాసులు రావడ దుర్గారావు, జి.వెంకటలక్ష్మి, టి.రాంబాబు తదితరులు పురపాలక సంఘం అధికారులకు విజ్ఞప్తి చేశారు. పందులకు తెగుళ్ళ రావడంతో చాలా పందులు చనిపోతున్నాయని, జనవాసంలో చనిపోవడం వల్ల దుర్వాసన అధికంగా వస్తుందని వాపోయారు. రాత్రి సమయాల్లో పందులు జనవాసాలలోకి రావడంతో పాటు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ స్పందించాలని కోరుతూ జనవాసాలకు దూరంగా పందులు ఉండే విధంగా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.


యాగర్లపల్లి 24వ వార్డులో చనిపోయిన పందులు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

అత్తిలి: ఇళ్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు త్వరితగతిన గృహనిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ డీఈ కేకేటీడీ ప్రసాద్ కోరారు. అత్తిలి గ్రామ సచివాలయంలో శుక్రవారం గృహనిర్మాణంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహం మంజూరైన 24 నెలల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అత్తిలిలో గృహాలు మంజూరైనా అధికశాతం మంది గృహాలు నిర్మించుకోకపోవడం తగదన్నారు. లబ్ధిదారులతో గృహాలు నిర్మించుకునేలా ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా విజేత, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీ కోఆప్షన్‌మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, గంటా నాగరాజు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, హౌసింగ్ ఏఈ సత్యనారాయణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పాలకొల్లు సెంట్రల్: వాకింగ్ వెళ్లిన మహిళ మెడలో గొలుసు చోరీకి గురైన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. శుక్రవారం పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఎం.వీరరాఘవమ్మ అనే మహిళ తన ఆడపడుచుతో కలిసి శుక్రవారం సాయంత్రం వరిదనం రోడ్డులో వాకింగ్‌కు బయలుదేరారు. ఇంతలో మోటర్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు రాఘవమ్మ మెడలో గొలుసు లాక్కుని పారిపోయారు. బంగారం గొలుసు సుమారు 7 కాసులు వరకూ ఉంటుంది. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

యువజనోత్సవాల్లో తణుకు విద్యార్థిని ప్రతిభ

తణుకు టౌన్: ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకూ కర్ణాటకలోని హుబ్లీ ధర్వాడలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ విభాగంలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థిని వివిధ అంశాలతో పాటు యోగాథాన్ 2022లో గిన్నీస్ వరల్డ్ రికార్డును సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థినీ అడపా కృష్ణ సాయి వర్షిత పాల్గొని రాక్ క్లైంబింగ్, స్కూబా డ్రైవింగ్, మౌంటైన్ బైకింగ్, పాస్ట్ బోటింగ్, సివిల్ ఏవియేషన్, రోప్ వాకింగ్ విభాగాల్లో ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించినట్లు తెలిపారు. యోగా థాన్ 2022లో గిన్నీస్ వరల్డ్ రికార్డు సర్టిఫికేట్‌ను గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏవో డా.డీ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, ఇతర అధ్యాపక సిబ్బంది తదితరులు అభినందించారు.

ఖాళీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో సామాజిక, పరివర్తన మార్పు కమ్యూనికేషన్ విభాగంలో ఖాళీగా ఉన్న ఒక పోస్టు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్, సోషల్ సైన్సెస్, మేనేజ్మెంట్ లేదా ఇలాంటి రంగాల్లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, westgodavari. ap. gov. in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు చూసుకొని, ఈ నెల 24న సాయంత్రం 3.00 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిజికల్ రిజ్యూమ్, అన్ని సర్టిఫికెట్లను కలెక్టరేట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని, వివరాలకు జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి అధికారి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

మూడు కేసుల నమోదు

ఆకివీడు: మండలంలోని సమతా నగర్ గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి సత్యనారాయణ పెద్దిరాజు అదే సమతా నగర్ కి చెందిన బందెల కిషోర్ పాత గొడవల నేపథ్యంలో 17వ తేది రాత్రి పరస్పరం దాడి చేసుకున్నారు. గాయపడిన కొమ్మారెడ్డి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాని ఎస్సై రాజారెడ్డి తెలిపారు. అలాగే ఆకివీడు మండలం పెద్దింట్లమ్మ గుడి, పడాల వారి వీధికి చెందిన తమ కుమార్తె కనిపించడంలేదని మైపాల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు రాజారెడ్డి కేసు నమోదు చేశారు. మాదివాడ చెందిన మోటుపల్లి దానయ్య ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రాంపుల నుంచి ఇసుకను కొనుగోలు చేసి అక్రమ మార్గంలో అధిక రేట్లకు అమ్ముతున్నట్లుగా సమాచారం అందడంతో గుమ్ములూరు రోడ్డు రాళ్ల చెరువు వద్ద సదురు పై వ్యక్తిని ట్రాక్టర్ తో ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

ముద్దచర్మ వ్యాధిపై రైతులకు అవగాహన


మేడపాడులో ఆవులకు వచ్చిన ముద్దచర్మ వ్యాధి గురించి రైతులకు వివరిస్తున్న పశు వైద్యాధికారి దొమ్మేటి మాధురి

యలమంచిలి: ప్రస్తుతం అన్ని రకాల ఆవులకు వ్యాపిస్తున్న లంపీ స్కిన్ డీసీజ్ (ముద్ద చర్మ వ్యాధి)పై రైతులు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ దొమ్మేటి మాధురి కోరారు. మండలంలోని మేడపాడు, బూరుగుపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించి వ్యాధి సోకిన ఆవులకు ఆమె వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఆవుకు జ్వరం వచ్చి చర్మంపై కంతులు, దద్దుర్లు రావడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె కోరారు. ఆవుకు త్వరితగతిన కొంత ఉపశమనం కలిగించడానికి కలబంద, తులసి, వేప ఆకులకు పసుపు కలిపి ముద్దగా నూరి ఆ మిశ్రమానికి కొబ్బరినూనె కలిపి ఆవుకు రాయవచ్చునని ఆమె చెప్పారు. లేదా కొబ్బరినూనె, ముద్ద హారతి కర్పూరం, వేప నూనె కలిపి రాయవచ్చునన్నారు. పశువు నీరసంగా కనిపిస్తే నూకలు లేదా గంట్లు జావ చేసి ఉప్పు కలిపి తాగించాలన్నారు. చిన్న దూడలకు గ్లూకోజ్ నీరు ఇవ్వవచ్చునని ఆమె చెప్పారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆ పశువును మంద నుంచి వేరు చేసి దూరంగా కట్టాలన్నారు. వైద్యులను సంప్రదించి తగు వైద్యం అందించడం ద్వారా పశువును రక్షించవచ్చునని ఆమె చెప్పారు. ఆమె వెంట వెటర్నరీ అసిస్టెంట్ కోర్సా వెంకట్రామయ్య ఉన్నారు.